క్లుప్తంగా

వైద్యశాల తనిఖీ



వైద్య ఆరోగ్య సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ పెంచలయ్య

చేజర్ల: మండలంలోని చిత్తలూరు ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి పెంచలయ్య శనివారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. మందుల గదిని పరిశీలించి స్టాక్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది పని తీరుపై ఆరా తీశారు. రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు జ్యోతి, స్టాఫ్ నర్సులు విజయమ్మ, అంజమ్మ పాల్గొన్నారు.

జలజీవన్ పథకం బోరుకు భూమిపూజ



జలజీవన్ పథకంలో బోరుకు భూమి పూజ చేస్తున్న దృశ్యం

చేజర్ల: పెన్నానది నుంచి చేజర్ల, మడపల్లి గ్రామాలకు తాగు నీరందించే జలజీవన్ పథకం బోరుకు ఎంపీపీ తూమాటి విజయభాస్కర్‌రెడ్డి శనివారం శంకు స్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటికి సురక్షితమైన తాగునీటిని అందించాలనే లక్ష్యంతో ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి జలజీవన్ పథకంలో నిధులు మంజూరు చేయించారన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వెంకటమ్మ, స్థానిక నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, వెంకటరెడ్డి, వరప్రసాద్, ఒంటేరు సుధీర్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వేపై అభ్యంతరాలు తెలుపుకోవాలి



అంగన్‌వాడీ కేంద్రంలో కోడిగుడ్లను పరిశీలిస్తున్న తహసీల్దారు

వరికుంటపాడు: మండలంలోని రీసర్వే పూర్తయిన గ్రామాల్లో ప్రజలు ఏవైనా అభ్యంతరాలు ఉంటే స్వయంగా రెవెన్యూ అధికారులకు తెలుపుకోవచ్చని తహసీల్దార్ నేలపాటి మల్లికార్జున తెలిపారు. ఆయన శనివారం మండలంలోని తూర్పుచెన్నంపల్లి, కాంచురువు గ్రామాల్లో రీసర్వే అభ్యంతరాలపై గ్రామసభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రీ సర్వే ద్వారా ప్రభుత్వం, పొలాలు, ఇళ్లను, గ్రామాలను రీసర్వే చేసి హద్దులు ఏర్పాటు చేస్తుందన్నారు. అభ్యంతరాలుంటే తెలుపుకోవాలన్నారు. అంతకుముందు ఆయన జడదేవి ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. ఉపాధ్యాయులు పాఠశాలల విద్యార్థులకు, అంగన్‌వాడీ కార్యకర్తలు చిన్నారులకు నాణ్యమైన విద్యను అందించాలన్నారు. అంగన్‌వాడీల ద్వారా అందే సేవలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

51 మద్యం బాటిళ్లు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లతో ఎస్సై, సిబ్బంది

ఉదయగిరి: పట్టణంలోని ఎస్సీ కాలనీలో మద్యం బెల్టు దుకాణాలపై శనివారం ఎస్సై కర్నాటి ఇంద్రసేనారెడ్డి తన సిబ్బందితో దాడులు నిర్వహించారు. 51మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని ఇద్దరు మహిళలను అదుపులోకి తీసుకున్నారు. ఎస్సై మాట్లాడుతూ ఎస్సీ కాలనీలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నారనే సమాచారం అందడంతో తమ సిబ్బందితో వెళ్లి దాడులు నిర్వహించామన్నారు. ఈ దాడుల్లో నాగిళ్ల మార్తమ్మ వద్ద 23 క్వార్టర్లు, నాగిళ్ల బాలమ్మ వద్ద 23 క్వార్టర్లు, 5 బీరు బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు.

గాయపడిన మహిళ మృతి

మర్రిపాడు: మండలంలోని నందవరం సమీపంలో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఓ మహిళ శనివారం మృతి చెందింది. పొంగూరు గ్రామానికి చెందిన సోమల ప్రసాద్ తన భార్య రాజేశ్వరి (52)తో కారులో నెల్లూరు వైపు వెళ్తుండగా రోడ్డు ప్రమాదం బోటు చేసుకున్న విషయం విదితమే. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాల పాలైన రాజేశ్వరి నెల్లూరు వైద్యశాలలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది. మర్రిపాడు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సర్కార్ బడులు.. కార్పొరేట్ సొబగులు



కొండాపురంలోని కేజీబీవీ పాఠశాల నాడు-నేడు పనులతో సుందరంగా మారిన దృశ్యం

ప్రభుత్వ పాఠశాలలకు మహర్దశ పట్టింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలోపేతం చేయడానికి చర్యలు చేపట్టారు. అందులో భాగంగా ప్రాథమిక పాఠశాలల నుంచి ఉన్నత పాఠశాలల వరకు పాత భవనాలను రూ.లక్షల వ్యయంతో కొత్త రూపురేఖలు తెచ్చారు. కార్పొరేట్ పాఠశాలలను తలదన్నే రీతిలో పాఠశాల ప్రాంగంలో వసతులను మెరుగు పరిచారు.

- నాడు–నేడు పథకంతో మారిన బడుల రూపురేఖలు
- మెరుగుపడిన వసతులు
- ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు

కొండాపురం: సర్కారు బడులు అంటే ప్రహరీలు లేని శిథిల భవనాలు.. మట్టి ప్రాంగణాలు.. పిచ్చి మొక్కలు పెరిగి పరిసరాల అపరిశుభ్రత వాతావరణం.. నేలపై చదువులు.. పెచ్చులూడి.. రంగు వెలిసిన బ్లాక్ బోర్డులు ఇవన్నీ.. గతం. ఇప్పుడు పాఠశాలలను చూస్తే ఇవి ప్రభుత్వ పాఠశాలలేనా అనే ఆశ్చర్యం కలిగించక తప్పదు. గతంలో పాఠశాలల శ్లాబులు పెచ్చులూడి, కిటికిలు, మౌలిక సదుపాయాలు, తాగు నీరు, తరగతి గదుల్లేక, మరుగుదొడ్లు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతూ ఉండేవారు. ఇలా చెప్పుకుంటే పోతే సమస్యలకు నిలయాలుగా ప్రభుత్వ పాఠశాలలు ఉండేవి. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్‌సీపీ పభుత్వం అధికారంలోకి రాగానే ప్రభుత్వ పాఠశాలలపై దృష్టి సారించారు. నాడు– నేడు పథకాన్ని ప్రారంభించి ప్రైవేట్ పాఠశాలకు దీటుగా సర్కార్ బడుల రూపురేఖలను మార్చారు. బడుల్లో మౌలిక వసతులు, తాగునీరు, పాఠశాలకు చుట్టు ప్రహరీ, అత్యాధునిక మరుగు దొడ్లు, అదనపు తరగతి గదులు, పాఠశాలల్లో మినరల్ వాటర్ ఫిల్టర్లు, తరగతి గదుల్లో ఆహ్లాదకరమైన వాతావరణంతో పాటు గ్రీన్ బోర్లు, పిల్లలకు బల్లలు, విద్యుత్ వెలుగులు, ఫ్యాన్లు ఇలా చెప్పుకుంటూ పోతే అనేక రకాల వసతులు, అభివృద్ధి జరిగాయి. ఇక పాఠశాల ప్రాంగణాలు చూస్తే టైల్స్‌తో కొత్తదనం కనబడుతోంది. ఖాళీ స్థలాల్లో గార్డెన్లు, ప్రహరీ గోడలు, తరగది గదుల గోడలపై పిల్లకు అవగాహన కల్పించి స్వాతంత్ర్య సమరయోధుల చిత్రాలు, విద్యకు ఉపయోగపడే బొమ్మలతో అద్భుతంగా కనిపిస్తున్నాయి. దీంతో పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగింది. విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేందుకు మక్కువ చూపుతున్నారు. స్కూళ్ల సుందరమైన బొమ్మలతో సరస్వతి నిలయాలుగా సగర్వంగా నిలబడుతున్నాయి.

కొండాపురం మండలంలో పాఠశాలలు మొత్తం	64
నాడు-నేడు ఫేజ్-1లో ఎంపిక చేసిన పాఠశాలలు	21
ప్రభుత్వం విడుదల చేసిన నిధులు	రూ.4.4 కోట్లు
పాఠశాలలకు ఖర్చు చేసిన నిధులు	రూ.3.58 కోట్లు



కేజీబీవీ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు



నాడు-నేడు పథకం ద్వారా ఇస్కదామెర్లలో సుందరంగా తయారైన పాఠశాల

రోజూ బడికి వెళుతున్నాను



నా పేరు దత్త మోహన్ సాయి. నేను కొండాపురం మండలం వెల్లిగండ్ల పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్నాను. గతంలో ఆరు బయట చెట్ల కింద పాఠాలు చెప్పేవారు. చెట్లపై నుంచి పాములు పడుతుండేవి. వర్షం వస్తే పాఠశాల ఉండేది కాదు. నేను కూడా పాఠశాలకు అప్పుడప్పుడు వెళ్లేవాడిని. ఇప్పుడు పాఠశాలకు కొత్త గదులు, మరుగుదొడ్లు, తాగు నీటి సౌకర్యాలు వచ్చాయి. నేను ప్రతి రోజు బడికి వెళుతున్నాను.

పూర్తిస్థాయిలో వసతులు



నా పేరు ఎస్ నిత్యశ్రీ. నేను కొండాపురంలోని కేజీబీవీ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాను. నాడు– నేడు పథకం ద్వారా మా పాఠశాలల్లో పూర్తిస్థాయిలో వసతులు కల్పించారు. వసతిగృహంలో కూడా మంచి వసతులు ఉన్నాయి. ఉపాధ్యాయినులు పాఠ్యాంశాలు బాగా బోధిస్తున్నారు. మేము చాలా శ్రద్ధగా చదువుతున్నాం. ఇక్కడ సౌకర్యాలు కార్పొరేట్ పాఠశాలలో కూడా దొరకవు. నాకు తెలిసిన విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలల్లో కల్పించిన వసతులపై తెలిపి వారిని కూడా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకోమని చెబుతాను.

గంధమహోత్సవానికి ఏర్పాట్లు

ఆత్మకూరు: పట్టణంలోని 23వ వార్డు నెల్లూరు పాళెం బీసీకాలనీలో సయ్యద్ ఖాదర్‌వలి ఔలియా గంధమహోత్సవాన్ని వైభవంగా నిర్వహించేందుకు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి సహకారంతో ఏర్పాట్లు పూర్తి చేశారు. జెండాచెట్టు ఉన్న దర్గాను వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. శనివారం అర్ధరాత్రి నుంచి గంధమహోత్సవం ప్రారంభమైంది. మున్సిపల్ వైస్ చైర్మన్లు డాక్టర్ కేవీ శ్రావణ్‌కుమార్, షేక్ సర్దార్‌తో పాటు వైఎస్సార్‌సీపీ నాయకులు కొప్పోలు చిన్నపరెడ్డి, సయ్యద్ జమీర్, కొండా చిన్న వెంకటేశ్వర్లు, కౌన్సిలర్లు శివకోటారెడ్డి, గంధళ్ల వేణు, తదితరులు పాల్గొన్నారు.



గంధమహోత్సవ వేడుకల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు, వైస్ చైర్మన్లు

అధిక యూరియా వినియోగం అనర్థం

ఆత్మకూరురూరల్: పంటల సాగులో మోతాదుకు మించి యూరియా వినియోగిస్తే రైతులు నష్టపోతారని ఆత్మకూరు సబ్ డివిజన్ వ్యవసాయశాఖ ఏడీఏ దేవసేనమ్మ అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో సాగులో ఉన్న వరి పైరును ఏఓ కిషోర్‌బాబుతో కలిసి శనివారం పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ పంట ఎదుగుదలకు 16 రకాల పోషకాలు అవసరం అవుతాయని, నత్రజని, భాస్వరం, పొటాష్‌తో పాటు సూక్ష్మపోషకాలైన జింక్ కూడా తగు మోతాదులో వినియోగించాలన్నారు. ఎన్‌పీకే ఎరువులు 4:2:1 నిష్పత్తిలో వరిపైరుకు అందించాలన్నారు. అనంతరం ఆత్మకూరు సిండికేట్ ఫార్మర్స్ సొసైటీ ఎరువుల గోడౌన్‌ను తనిఖీ చేసి నిల్వలను పరిశీలించారు.



దేపూరు వద్ద వరి పైరును పరిశీలిస్తున్న ఏడీఏ దేవసేన, తదితరులు

గురుకుల పాఠశాలలో ఆకస్మిక తనిఖీ

సంగం: సంగంలోని స్థానిక బాలికల గురుకుల పాఠశాలను ఏపీ ఫుడ్ కమిషన్ మెంబరు జీ దేవి శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. డైనింగ్ హాల్‌లో ఉన్న వంట గది, సరుకులు నిల్వ చేసే గదులను, సరుకుల నాణ్యతను పరిశీలించారు. ప్రభుత్వం మెనూను అమలు చేస్తున్నారా లేదా అని పాఠశాల సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం మధ్యాహ్నం భోజనం పరిశీలించి భోజనాన్ని రుచి చూశారు. విద్యార్థులను భోజనం నాణ్యతను అడిగి తెలుసుకున్నారు. ఆమె మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలతో పాటు అంగన్‌వాడీ పాఠశాలలు, హాస్పిటళ్లను ముమ్మరంగా తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పలు పాఠశాలల్లో విద్యార్థులు మధ్యాహ్నం భోజనం తినకుండా ఇంటి నుంచి క్యారేజ్ తీసుకు వస్తుండడాన్ని గమనించి, విద్యార్థులు పాఠశాలల్లో భోజనం చేసేలా అవగాహన కల్పించాలని ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. ప్రతి పాఠశాలలో 100 శాతం విద్యార్థులు మధ్యాహ్న భోజనం తినడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ డీడీ రమేష్, ఐసీడీఎస్ అధికారులు, డీఎస్ఓ వెంకటేశ్వర్లు, ప్రిన్సిపల్ సుమతి, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.



విద్యార్థుల మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఏపీ ఫుడ్ కమిషన్ సభ్యురాలు జీ దేవి

కోవిడ్ ముప్పుపై నృత్య రూపకం

కావలి: దేశంలో కరోనా కేసులు క్రమంగా పెరుగుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ మళ్లీ జాగ్రత్తలు పాటించాలంటూ పట్టణంలో ఫిజియోథెరపీ, నర్సింగ్ విద్యార్థులు నృత్యాలు, పాటల రూపకాలు శనివారం ఆకస్మిక ప్రదర్శనలతో (ఫ్లాష్ మాబ్) ప్రజలను ఆకట్టుకున్నాయి. దేశంలో మళ్లీ కలవరపాటుకు గురి చేస్తున్న కరోనా మరణాలపై శ్రీలక్ష్మి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ చైర్మన్ కే మాధవరెడ్డి ఆధ్వర్యంలో ఆ ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన ఫిజియోథెరపీ, నర్సింగ్ విద్యార్థులు ప్రదర్శనలు నిర్వహించారు. మళ్లీ పెరుగుతున్న కోవిడ్ ముప్పు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను నృత్యాలు, పాటల రూపంలో ఆకట్టుకునేలా వివరించారు. పాతూరు కృష్ణుడి బొమ్మసెంటర్, ఆర్టీసీ బస్టాండ్, ఉదయగిరి బ్రిడ్జి కూడలిలో 15 నిమిషాల పాటు ప్రత్యేక ప్రదర్శనలు నిర్వహించారు. కార్యక్రమంలో కావలి రెడ్‌క్రాస్ చైర్మన్ డి రవిప్రకాష్, కావలి ఆర్టీసీ డిపో మేనేజర్ రాపూరు శ్రీనివాసులు, జనిగర్ల మహేంద్ర యాదవ్, ఈతముక్కల చందు తదితరులు పాల్గొన్నారు.



కావలి: పట్టణంలో కరోనాపై ఫ్లాష్‌మాబ్ ద్వారా అవగాహన కలిగిస్తున్న విద్యార్థులు

నేడు పెంపు పింఛన్ పంపిణీ

కొండాపురం/ఉదయగిరి: కొండాపురం ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు పెంచిన పింఛన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ శేషసాయి శనివారం తెలిపారు. ఉదయగిరి ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఆదివారం ఉదయం 11 గంటలకు వైఎస్సార్ నూతనపెన్షన్ల కానుక పంపిణీ కార్యక్రమం జరుగుతుందని ఎంపీడీఓ డీ ఈశ్వరమ్మ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయగిరి సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై లబ్ధిదారులకు పింఛన్‌లు పంపిణీ చేస్తారని తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

ఇంటి పన్ను బకాయిలపై దృష్టి సారించాలి

వరికుంటపాడు: మండలంలోని పంచాయతీ కార్యదర్శులు ఇంటి పన్ను బకాయిలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని ఇన్‌చార్జి ఈఓపీఆర్డీ షేక్ సికిందర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్చిలోపు కార్యదర్శులు ఇంటి, కుళాయి పన్నులు నూరు శాతం వసూలు చేయాలన్నారు. ప్రజలు పన్ను చెల్లింపులను ఫోన్‌పే, క్యూఆర్ కోడ్ ద్వారా చేయాలన్నారు.

విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

- సీనియర్ సివిల్ జడ్జి బి రాజేష్



ఆత్మకూరు: విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన పెంచుకోవాలని, ఆ దిశగా ఆలోచించినప్పుడే వారి వ్యక్తిత్వంతో పాటు భవిష్యత్ ఉజ్వలంగా ఉంటుందని ఆత్మకూరు కోర్టు సీనియర్ సివిల్ జడ్జి బి రాజేష్ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం న్యాయ విజ్ఞాన మండలి ఆధ్వర్యంలో చట్టాలపై అవగాహన, సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ క్రమశిక్షణ తప్పిన జీవితం, న్యాయం గురించి సరైన ఆలోచన ఉన్న విద్యార్థులు ఉన్నత స్థితికి చేరుకుంటారన్నారు. సీనియర్ న్యాయవాదులు ఎలీవీ రమణయ్య, ఇన్‌చార్జి హెచ్ఎం పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

సంక్రాంతి కానుక పంపిణీ

మర్రిపాడు: సాహో ఫౌండేషన్ ఆధ్వర్యంలో నందవరం మోడల్ స్కూల్, నందవరం, పోలిరెడ్డిపల్లి, కంపసముద్రం, బ్రాహ్మణపల్లి, టీఎన్‌పేట, చుంచులూరు, కదిరినాయుడుపల్లి ఉన్నత పాఠశాల్లో తల్లి లేదా తండ్రి లేని విద్యార్థులకు శనివారం సంక్రాంతి కానుకను పంపిణీ చేశారు. మాజీ మండల అధ్యక్షుడు కటారి రమణయ్య మాట్లాడుతూ తల్లిదండ్రులు లేని విద్యార్థుల్లో ధైర్యం నింపడానికి, వారు జీవితంలో స్థిరపడే వరకు సహాయ సహకారాలు అందించడానికి పడవల నాగేశ్వరావు, సునీత దంపతులు సాహో ఫౌండేషన్ ఏర్పాటు చేశారన్నారు. మాజీ ఎంఈఓ సత్యనారాయణ, ఫౌండేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు నాణ్యమైన ఔషధాలు



కావలి: ఔషధ నియంత్రణ కార్యాలయ నిర్మాణానికి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి శంకుస్థాపన

- రూ.40 లక్షలతో ఔషధ నియంత్రణ కార్యాలయ నిర్మాణానికి శంకుస్థాపన
- ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి

కావలి: ప్రజలకు నాణ్యమైన ఔషధాల పంపిణీకి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని కచ్చేరిమిట్ట సమీపంలో రూ.40 లక్షలతో ఔషధ నియంత్రణ కార్యాలయం ఏర్పాటుకు ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డి శనివారం శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వం ప్రజారోగ్యానికి పెద్దపీట వేసిందన్నారు. అందులో భాగంగా ఆరోగ్యశ్రీ పరిధిని విస్తరించడంతో పాటు జగనన్న ఆరోగ్యసురక్ష ద్వారా ప్రతి పేద కుటుంబానికి కార్పొరేట్ వైద్యం అందించేలా సచివాలయాల పరిధిలోనే ప్రత్యేక ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జగనన్న ఆరోగ్య సురక్ష తొలి విడత, రెండో విడత ద్వారా మారుమూల పల్లెలకు కూడా కార్పొరేట్ వైద్యాన్ని చేరువ చేసినట్లు వివరించారు. ప్రజలకు మెరుగైన వైద్యంతో పాటు నాణ్యమైన మందులు కూడా అందుబాటులో ఉంచేందుకు, నకిలీలను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు తెలిపారు. అందులో భాగంగా కావలిలో రూ.40లక్షలతో ఔషధ నియంత్రణ కార్యాలయాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. వైద్యారోగ్యశాఖ అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న మేలు మరిచిపోవద్దు

- రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు



నూతన పింఛన్ అందజేస్తున్న బీద మస్తాన్‌రావు

అల్లూరు: ముఖ్యమంత్రి జగనన్న పేద, బడుగు, బలహీన వర్గాలైన అర్హులకు అనేక సంక్షేమ పథకాలు అందజేస్తూ వారి అభివృద్ధికి పాటుపడుతున్నారని, రానున్న ఎన్నికల్లో జగనన్నను మళ్లీ గెలిపించుకోవాలని రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు తెలియజేశారు. శనివారం మండలంలోని ఇస్కపల్లిలో బీఎంఆర్ కాలనీలోని సొంత స్థలం కలిగిన 30 మంది నిరుపేదలకు జగనన్న హౌసింగ్ స్కీంలో అర్హత పొందిన వారికి గృహనిర్మాణాలకు శంకుస్థాపనలో బీద మస్తాన్ రావు పాల్గొన్నారు. కొత్తగా మంజూరైన లబ్ధిదారులకు పింఛన్ నగదును అందజేశారు. బీద మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు, ఆయన గతంలో చేపట్టిన పాదయాత్రలో ఇచ్చిన హామీలు పూర్తి చేశారని గుర్తుచేశారు. రూ 2 వేల నుంచి ఐదు సంవత్సరాల్లో రూ.3 వేలకు పింఛన్ పెంచారని, అలాంటి ముఖ్యమంత్రిని లబ్ధి పొందిన ప్రతి ఒక్కరూ గర్తు పెట్టుకోవాలన్నారు. జగనన్న లేఅవుట్ల ద్వారా ఇళ్లను మంజూరు చేసిన ఘనత దేశ చరిత్రలోనే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ఇళ్ల స్థలం ఇవ్వడమే కాకుండా హౌసింగ్‌లో ఇళ్ల నిర్మాణానికి రూ.1.80 లక్షలు అందిస్తున్నారన్నారు. ఇలాంటి ముఖ్యమంత్రిని తిరిగి 2024లో రెండో సారి ముఖ్యమంత్రిగా, ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డిని ఎమ్మెల్యేగా గెలిపించుకునే బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ శశిరేఖ, జెడ్పీటీసీ వేణమ్మ, సర్పంచ్ రంజిత్ కుమార్, వైఎస్సార్‌సీపీ రూరల్ కన్వీనర్ బీద రమేష్‌బాబు, నాయకులు, కాపులు తదితరులు పాల్గొన్నారు.

రేషన్ పంపిణీపై జేసీ ఆకస్మిక తనిఖీ

- అంగన్‌వాడీ కేంద్రం, రేషన్ పంపిణీ పరిశీలన



రేషన్ పంపిణీ వాహనం వద్ద లబ్ధిదారులతో మాట్లాడుతున్న జేసీ కూర్మనాథ్

సంగం: సంగం సాయినగర్‌లో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని, రేషన్ డిస్ట్రిబ్యూషన్ వాహనాన్ని శనివారం జిల్లా జాయింట్ కలెక్టర్ రోణంకి కూర్మనాథ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహారం అందుతుందా లేదా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం రేషన్ వాహనాన్ని తనిఖీ చేసి రేషన్ పంపిణీ తీరుపై లబ్ధిదారులతో మాట్లాడారు. రేషన్ సరుకులు సక్రమంగా అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. సరుకుల నాణ్యతను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా అంగన్‌వాడీ కార్మికుల సమ్మె నేపథ్యంలో అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు, గర్భిణులు ఇబ్బందులు పడకుండా సచివాలయ సిబ్బందితో కేంద్రాలను నడిపిస్తున్నామని తెలిపారు. పండగ వస్తున్న నేపథ్యంలో త్వరితగతిన రైస్ డిస్ట్రిబ్యూషన్ ప్రక్రియ పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. జిల్లాలో ఎక్కడా ఎటువంటి ఇబ్బందులు లేకుండా రేషన్ పంపిణీ ప్రక్రియ సజావుగా జరుగుతుందన్నారు. ఆయన వెంట డిప్యూటీ తహసీల్దారు ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

కావలి కాలువలో పూడికతీత పనులు ప్రారంభం



హనుమకొండపాళెం మేజర్ వద్ద పూడికతీత పనులు ప్రారంభిస్తున్న దృశ్యం

జలదంకి: ఉదయగిరి సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి సొంత నిధులతో చేపట్టిన కావలి కాలువ పూడిక తీత పనులను శనివారం వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పాలవల్లి మాలకొండారెడ్డి ప్రారంభించారు. కావలి కాలువ ద్వారా మండలంలోని చినక్రాక బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ వరకు సాగునీరందేలా రాజగోపాల్‌రెడ్డి అధికారులతో చర్చలు జరిపారు. హనుమకొండపాళెం మేజర్ నుంచి వెంకటేశ్వరపాళెం మేజర్ వరకు కాలువ కొంత మేర పూడిపోయి ఉంది. దీంతో రైతులకు సాగునీరందేందుకు ఇబ్బందులు వస్తున్నాయని రైతులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దీంతో రాజగోపాల్‌రెడ్డి హనుమకొండపాళెం మేజర్ నుంచి వెంకటేశ్వరపాళెం మేజర్ వరకు యుద్ధ ప్రాతిపదికన పూడికతీత పనులు చేయిస్తున్నారు. మండల అధ్యక్షుడు మాలకొండారెడ్డి మాట్లాడుతూ మండల రైతుల శ్రేయస్సు దృష్ట్యా సొంత నిధులతో పూడికతీత పనులు చేపడుతుండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారన్నారు. కావలి కాలువ ఏఈ రామారావు, సొసైటీ చైర్మన్ కేతిరెడ్డి రవీంద్రరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార కార్యదర్శి ఇస్కా మదన్‌మోహన్‌రెడ్డి, మండల బూత్ కమిటీల అధ్యక్షుడు సురె వెంకటశేషారెడ్డి, చినక్రాక, వేములపాడు సర్పంచ్‌లు పులి భాస్కర్, బోడిమండ్ల కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

పెంచిన పింఛన్, ట్యాబ్‌ల పంపిణీ

కావలి: దగదర్తి మండలం చెన్నూరులో శనివారం ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి పెంచిన రూ.3,000 పింఛన్ నగదు, విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కరోనా సమయంలో అడ్రస్ లేని టీడీపీ నాయకులు, ఎన్నికలు వచ్చే సరికి ఓట్లు కోసం వేషాలు వేస్తున్నారని ఎద్దేవా చేశారు. ప్రజలు కరోనా వంటి విపత్తులో విలవిల లాడినప్పుడు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు మాత్రమే ప్రజలకు అండగా ఉండి సేవలు అందించారని ఎమ్మెల్యే గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తాళ్లూరు ప్రసాద్‌నాయుడు, నాయకులు అనిల్‌రెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

జెండా ఉత్సవంలో ఎంపీ, ఎమ్మెల్యే

అల్లూరు: స్థానిక మారుతి కాలనీలోని ఆంజనేయ స్వామి ఆలయంలో శనివారం నిర్వహించిన జెండా ఉత్సవంలో రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు, ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎంపీ, ఎమ్మెల్యే స్థానికులు తీన్‌మార్ బ్యాండ్, కోలాటాలు, మంగళవాద్యాలు, బాణసంచాలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా కమిటీ సభ్యులు నీలం సాయికుమార్, రూరల్ కన్వీనర్ బీద రమేష్, ఏఎంసీ వైస్ చైర్మన్ ఊటు శ్రీకాంత్ రెడ్డి, వెస్ట్ బ్యాంక్ సొసైటీ చైర్మన్ భక్తవత్సలరెడ్డి, రూరల్ బ్యాంక్ చైర్మన్ మేడా శ్రీనివాసుల రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న రామిరెడ్డి, బీద మస్తాన్ రావు